సాక్షి
కుమురం భీం

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ఒత్తిడిని జయిద్దాం.. IIలో▸

ఇంటర్ ఫలితాల విడుదలతో విద్యార్థులపై ఒత్తిడి నెలకొంది. ఈ సమయంలో ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధ్యమని గుర్తించాలి. జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాలి.



'మహంకాళి' బోనాలు

ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి ఆలయంలో జాతర కొనసాగుతోంది. రెండో రోజు అమ్మవారి బోనాల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.6 /28.5

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కూలీలకు వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతి

సిర్పూర్(టి): వేసవి నేపథ్యంలో ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ కూలీలకు పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు వసూలు చేయాలన్నారు. పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్తు నాశనం

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందని ఎస్పీ సురేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే 87126 70523 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. మత్తుకు బానిసలుగా మారిన వారికి డీఅడిక్షన్ కేంద్రాల్లో కౌన్సెలింగ్ ఇప్పిస్తామన్నారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయించే వారి సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా జంగుబాపు

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ బీఎస్పీ అభ్యర్థిగా మెస్రం జంగుబాపు ఖరారయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య జంగుబాపునకు బీ ఫామ్ అందజేశారు. బజార్‌హత్నూర్ మండలం ఎల్లయ్యపల్లె గ్రామానికి చెందిన జంగుబాపు గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బోథ్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కౌటాల(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో పూర్తి విఫలమైందన్నారు. ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు ప్రతీ కార్యకర్త ప్రచారం నిర్వహించాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రైతులకు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సక్కు శంకర్, నాగపూరే బండు, దుర్గం వెంకటేశ్, కామ్రె శంకరయ్య, దొబ్బల మంగేశ్, శంకర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. 18 వాహనాలను వేలం వేయగా, రూ.4,70,606 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సామ్యూల్‌జాన్, ఎస్సైలు రాజేందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలదే హవా!

- ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదల
- ఫస్టియర్‌లో 8వ స్థానం.. సెకండియర్‌లో 7వ స్థానంలో జిల్లా
- గతంతో పోలిస్తే దిగజారిన వైనం
- సత్తా చాటిన కేజీబీవీలు, గురుకులాలు



జిల్లా కేంద్రంలో విద్యార్థులను అభినందిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు అదరగొట్టారు. ఇంటర్ ఫలితాలను బుధవారం అధికారులు విడుదల చేశారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత తగ్గింది. జనరల్ ఫస్టియర్ విభాగంలో మొత్తం 2,097 మంది బాలురు హాజరయ్యారు. ఇందులో 982 మంది ఉత్తీర్ణులు కాగా.. 46.83 ఉత్తీర్ణత శాతం సాధించారు. 2,473 మంది బాలికలకు 1,831 మంది పాసయ్యారు. 74.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా మొదటి సంవత్సరం పరీక్షలకు 4,570 మంది హాజరు కాగా 2,813 మంది పాసయ్యారు. 61.55 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక జనరల్ సెకండియర్ విద్యార్థుల్లో బాలురు 1929 మంది పరీక్షలు రాశారు. ఇందులో 1176 మంది పాసయ్యారు. 60.96 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 2,166 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా.. 1775 మంది ఉత్తీర్ణులయ్యారు. 81.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా 4,095 మంది పరీక్షలకు హాజరు కాగా 2,951 మంది పాసయ్యారు. 72.06 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్, సెకండియర్ లోనూ బాలికలే సత్తా చాటడం విశేషం. మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో కుమురంభీం ఆసిఫాబాద్ ఎనిమిదో స్థానంలో నిలవగా.. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఏడో స్థానంలో నిలిచింది.

ఒకేషనల్ విభాగంలో ఇలా..

ఒకేషనల్ విభాగం ఫస్టియర్ పరీక్షలకు జిల్లాలో బాలురు 423 మంది హాజరయ్యారు. ఇందులో 206 మంది పాసయ్యారు. 48.7 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 430 మంది పరీక్షలు రాయగా.. 274 మంది ఉత్తీర్ణులయ్యారు. 63.72 ఉత్తీర్ణత శాతం సాధించారు. మొత్తంగా 853 మంది పరీక్షలు రాయగా 480 మంది పాసయ్యారు. 56.27 ఉత్తీర్ణత శాతం సాధించారు. ఒకేషనల్ విభాగంలో సెకండియర్ విద్యార్థుల్లో బాలురు 298 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 227 మంది పాసయ్యారు. 76.17 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 364 మంది హాజరు కాగా 299 మంది ఉత్తీర్ణులు కాగా.. 82.14 శాతం పాస్ పర్సంటేజీ నమోదైంది. మొత్తం 662 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 526 మంది పాసయ్యారు. 79.46 ఉత్తీర్ణత శాతం సాధించారు. ప్రైవేట్ ఫీజులు చెల్లించిన విద్యార్థుల్లో చాలా మంది పరీక్షలు రాసేందుకు ఆసక్తి చూపలేదు. జనరల్ విభాగం సెకండియర్‌లో బాలురు 139 మంది పరీక్షలు రాస్తే కేవలం 35 మంది, బాలికలు 75 మందికి 20 మంది మాత్రమే మాత్రమే పాసయ్యారు. మొత్తంగా 214 మంది పరీక్షలకు హాజరైతే 55 మంది పాసయ్యారు. 25.7 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఒకేషనల్ విభాగంలో సెకండియర్ విద్యార్థులు కూడా పలువురు ప్రైవేట్‌గా పరీక్షలు రాశారు. బాలురు 24 మంది పరీక్షలకు హాజరైతే కేవలం ఐదుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. బాలికలు ఎనిమిది మందికి నలుగురు పాసయ్యారు. మొత్తంగా 32 మంది విద్యార్థులకు తొమ్మిది మంది ఉత్తీర్ణత సాధించగా.. 28.13 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు ఈ నెల 25 నుంచి మే 2 వరకు చెల్లించేందుకు అవకాశం ఉంది. అలాగే రీకౌంటింగ్‌కు రూ.600, రీవాల్యూవేషన్ కోసం పేపర్‌కు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆరేళ్ల ఫలితాలు ఇలా..

సంవత్సరం	హాజరైనవారు	ఉత్తీర్ణులు	శాతం	జిల్లాస్థానం
2018 ఫస్టియర్	3227	2296	71	3
సెకండియర్	3202	2562	80	1
2019 ఫస్టియర్	3350	2275	68	3
సెకండియర్	3009	2282	75	2
2020 ఫస్టియర్	3856	2739	71	2
సెకండియర్	3078	2487	80	1
2021 ఫస్టియర్	5252	3716	70	3
సెకండియర్	4826	3678	76	2
2022 ఫస్టియర్	5137	3748	74	3
సెకండియర్	4697	3793	81	2
2023–24 ఫస్టియర్	4570	2813	61	8
సెకండియర్	4095	2951	81	7

మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో అక్షయ 983, పూజిత 983 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. అలాగే శ్రీహర్షిత 974, సలోని 973, నాగమణి 965, జ్యోతి 965, హర్షిత 961, కార్తీక్ 952 మార్కులు సాధించారు. బైపీసీలో శ్రావ్య 966, సౌమ్య 966 మేఘన 962, సీఈసీలో అఖిల 944, మనూష 912, ఎంఈసీలో శిరీష 915, తిరుమల 900 మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరం ఎంపీసీలో అదీబా తెహ్రీమ్ 470 మార్కులకు 457, శ్రీహర్షిత 454, సమత 452, బైపీసీలో శ్రావణి 440 మార్కులకు 416, ప్రణీత 405, సీఈసీలో సువర్ణ 435, వైష్ణవి 432 మార్కులు సాధించారు. మొత్తం 20 మంది 400పైగా మార్కులు సాధించారు. గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఎంపీసీలో నిహారిక 926, సునీత 935 మార్కులు సాధించారు.



అక్షయ, ఎంపీసీ (983/1000)



పూజిత, ఎంపీసీ (983/1000)



శ్రీహర్షిత, ఎంపీసీ (974/1000)



సలోని, ఎంపీసీ (973/1000)



నాగమణి, ఎంపీసీ (965/1000)



శ్రావ్య, బైపీసీ (966/1000)



సౌమ్య, బైపీసీ (966/1000)



మేఘన, బైపీసీ (962/1000)



అదీబా తెహ్రీమ్, ఎంపీసీ (457/470)



శ్రీహర్షిత, ఎంపీసీ (454/470)

సత్తా చాటిన గురుకులాలు, కస్తూరిబా, మోడల్ స్కూళ్ల విద్యార్థులు

గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా గురుకుల కళాశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలో 314 మంది టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 296 మంది ఉత్తీర్ణత సాధించారు. 94.27 శాతం ఉత్తీర్ణత నమోదైంది. టీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలల విద్యార్థులు 485 మందికి 401 మంది పాసయ్యారు. 82.68 శాతం ఉత్తీర్ణత సాధించారు. మైనార్టీ గురుకులాల నుంచి 111 మంది పరీక్షలు రాస్తే 67 మంది పాసయ్యారు. 60.36 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బీసీ గురుకులాల నుంచి 141 మందికి 114 పాసయ్యారు. 15 కేజీబీవీల నుంచి 606 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 465 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 76.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే జిల్లాలో రెండు మోడల్ స్కూల్ ఉండగా.. 271 మంది పరీక్షలు రాశారు. వీరిలో 232 మంది ఉత్తీర్ణత సాధించగా.. 85.61 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇక ప్రభుత్వ కళాశాలలు 15 ఉండగా 2485 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 1360 మంది పాసయ్యారు. 54.73 ఉత్తీర్ణత సాధించారు.

ఏనుగు దాడి బాధితులకు పరిహారం

- మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎఫ్‌డీవో

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: ఏనుగు దాడిలో మృతి చెందిన రైతుల కుటుంబాలకు కాగజ్‌నగర్ పట్టణంలోని అటవీ డివిజనల్ కార్యాలయంలో బుధవారం ఎఫ్‌డీవో అప్పలకొండ రూ. 10లక్షల చొప్పున పరిహారం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చింతలమానెపల్లి మండలం బూరెపల్లికి చెందిన అల్లూరి శంకర్, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన కారు పోశన్న ఏనుగుదాడిలో మృతి చెందారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున పరిహారం మంజూరైనట్లు తెలిపారు. ఏనుగుల ఆవాసాలు గుర్తించి జనా వాసాల్లోకి రాకుండా రక్షణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఏనుగులు అటవీ ప్రాంతాల్లోనే ఉండేలా తాగునీరు, ఆహారం అందుబాటులో ఉంచుతామన్నారు. ఇందులో భాగంగా ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, పండ్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భద్రతా వాహనాలు, డ్రోన్‌లు, నైట్‌విజన్ పరికరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను గుర్తిస్తున్నామ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు రమాదేవి, చంద్రమౌళి, డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియా పర్యటనకు వచ్చిన సీఎండీ బలరాంను బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గోలేటి, మాదారం డిస్పెన్సరీలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గోలేటి ఓసీపీని త్వరగా ప్రారంభించాలని కోరారు. ఏరియా ఆసుపత్రిలో స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని, జీఎం కార్యాలయంలో రెస్ట్‌హాల్ నిర్మించాలని, వెహికల్ డ్రైవర్లకు రెస్ట్ షెల్టర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు ప్రకాశ్‌రావు, ఏరియా కార్యదర్శులు సంజీవరెడ్డి, చంద్రకుమార్, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'నేషనల్ హైవే' పరిహారంపై విచారణ

- 'సాక్షి' కథనంపై స్పందించిన ఏసీబీ అధికారులు
- ప్రాథమిక విచారణ చేపట్టిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

సాక్షి ఎఫెక్ట్..



ఆర్డీవో కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ఏసీబీ అధికారి

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. నేషనల్ హైవే కు సంబంధించి పరిహారం పంపిణీపై ఆరా తీశారు. కొంతమంది రూ.లక్షలు బినామీల ద్వారా తమ బ్యాంకు ఖాతాల్లో వేయించుకున్నందుకు, ఇతర భూ ములు, వెంచర్లపై వివరాలు సేకరించారు. జిల్లాలో చేపట్టిన నేషనల్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన వారికి అందించిన నష్టపరిహారంలో భారీగా అవినీతి అక్రమాలు జరిగినట్లు బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అడ్డగోలుగా అక్రమార్జన' అనే కథనానికి కరీంనగర్ ఏసీబీ అధి కారులు స్పందించారు. అలాగే జిల్లాకు చెందిన కొందరు ఫిర్యాదు చేయడంతో ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్డీవో సిడాం దత్తు, డిప్యూటీ తహసీల్దార్ మెస్రం మనోహర్, ఎంసీ భరత్‌తోపాటు మరో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అవకతవకలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం భూముల పరిహారం చెల్లింపుల్లో బాధ్యులపై కేసు నమోదు చేయనున్నట్లు ఆయ న వివరించారు. రహదారి నిర్మాణంలో నష్టపరిహా రం చెల్లింపులకు సంబంధించిన వివరాలు, అవార్డు కాపీలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ దరఖాస్తు సమర్పించినట్లు సూపరింటెండెంట్ సాయన్న వెల్లడించారు.

నామినేషన్ల జాతర

- ఏడో రోజు పన్నెండు నామినేషన్లు
- ఒకేరోజు నాలుగు సెట్లు వేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్
- నేటితో ముగియనున్న ప్రక్రియ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024



నామినేషన్ వేస్తున్న నగేశ్, పక్కన మహేశ్వర్‌రెడ్డి, శంకర్, రామారావు పటేల్, హరీశ్‌బాబు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఏడో రోజు జాతరలా కొనసాగింది. బుధవారం అత్యధికంగా 12 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నాలుగు సెట్లు దాఖలు చేశారు. తొలి సెట్‌ను పార్టీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు అందజేశారు. రెండో సెట్‌ను పార్టీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రాజేశ్‌బాబు, అశోక్ ముస్తాపురే, జ్యోతితో కలిసి దాఖలు చేశారు. మూడో సెట్‌ను ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆరెల్లి మల్లేశ్, పార్టీ నాయకులు వేదవ్యాస్, కైలాస్, పద్మ అందజేశారు. నాలుగో సెట్‌ను పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్, కొత్తపల్లి శ్రీనివాస్, జ్యోతిరెడ్డి, మయూర్‌తో కలిసి గోడం నగేశ్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు తరఫున జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నాయకులు దుర్వ నగేశ్, పురుషోత్తం యాదవ్, డాక్టర్ కిరణ్‌కుమార్, సాజిదొద్దీన్ మూడో సెట్ దాఖలు చేశారు. నాలుగో సెట్‌ను పడకంటి రమాదేవి, సోనేరావు, బుర్స పోచయ్య, దత్తు, శంకర్ అందజేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కంది శ్రీనివాసరెడ్డి, కరీం, అజ్రోజ్‌తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ తరఫున మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, ఇండిపెండెంట్లుగా రాథోడ్ సుభాష్, నేతావత్ రాందాస్, కొమురం మంతాయ్య, గొండ్వాన దండకారణ్య పార్టీ తరఫున కొడప వామనరావు నామినేషన్లు వేశారు. వీరంతా కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు నామినేషన్ పత్రాలు అందజేశారు. బుధవారం నాటికి నామినేషన్ల సంఖ్య 24కు చేరింది. కాగా, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనుంది.

'ఉపాధి' పనులపై నిర్లక్ష్యం వద్దు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పనుల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి ఉపాధిహామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య తగ్గడంపై వివరణ కోరారు. పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. అర్హులైన వారికి పని కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స అందించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

కెరమెరి(ఆసిఫాబాద్): పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ఝరి, గోయగాం, మోడి, కెరమెరి గ్రామ పంచాయతీలను బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలన్నారు. చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను వినియోగించాలన్నారు. తాగునీటి తిప్పలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీవో అంజద్ పాషా, ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

శారీరక, మానసికాభివృద్ధికి 'అంగన్‌వాడీ'ల తోడ్పాటు



చిన్నారులతో అధికారి, అంగన్‌వాడీ సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: చిన్నారులు శారీరక, మానసికాభివృద్ధి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో తోడ్పాటును అందిస్తాయని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రెబ్బెన మండలం నవేగాం, రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం సామూహిక గ్రాడ్యుయేషన్ డేకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లల ప్రాథమిక విద్యకు పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. ఏటా ఏప్రిల్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ప్రీస్కూల్ నుంచి ప్రాథమిక పాఠశాలలకు అర్హత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 30 మంది చిన్నారుల తల్లిదండ్రులకు ప్రోగ్రెస్‌కార్డులు అందించారు. సీడీపీవో సాదియా రుక్సానా, సూపర్‌వైజర్ కళావతి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ స్వప్న, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాకిడిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

సిర్పూర్(టి): పార్లమెంట్ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని మాకిడి, జక్కాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వసతి, ఫ్యాన్లు, విద్యుత్, నీడ కోసం టెంట్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మద్యం, నగదు, బంగారం తరలించకుండా నియంత్రేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

పనులు పూర్తి చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక, జంబుగ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ వందశాతం పోలింగ్ నమోదయ్యే విధంగా ప్రజలకు అవగాహన కల్పించి, ఓటర్లు వసతులు కల్పించాలన్నారు. ఓటరు స్లిప్పులు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ నెల 25 నుంచి ఓటర్లు స్లిప్పుల పంపిణీకి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

క్లుప్తంగా

గుడుంబా పట్టివేత

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఐతపల్లిలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 80 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన దాసరి సాయికుమార్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 80 లీటర్ల గుడుంబా లభ్యమైంది. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి



బాలాజీ మృతదేహం

లింగాపూర్: బావిలోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వంజారిగూడకు చెందిన ముండే బాలాజీ (28)కి చిన్ననాటి నుంచి మతిస్థిమితం సరిగాలేదు. గతంలో పలుమార్లు ఇంటినుంచి బయటకు వెళ్లిపోగా కుటుంబ సభ్యులు వెతికి ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 23న పంటచేనుకు వెళ్లి ఇంటికి రాలేదు. బుధవారం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా నాగర్‌గోజే సంజీవ్ పంటచేనులోని బావిలో మృతదేహం కనిపించింది. మృతుని తండ్రి ముండె శేషరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన అటకపురం లక్ష్మి (42) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. చింతలమానెపల్లికి చెందిన లక్ష్మి ఈ నెల 16న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు, బంధువులు గాలింపులు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మహిళ భర్త అటకపురం నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికదాడి కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పు చెప్పారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌కు చెందిన బాలిక (17) జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈ క్రమంలో తుంపెల్లి గ్రామానికి చెందిన పోలవేణి సాయి ఆమెకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నాడు. దీంతో పాటు బాధితురాలి తండ్రిని కులం పేరుతో దూషించాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఐవోలు దయానంద్‌రావు, డీఎస్పీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఒత్తిడిని జయిద్దాం.. విజయం సాధిద్దాం..

- చదువులో తప్పితే... జీవితంలో ఓడినట్లు కాదు
- ఓటమి గెలుపునకు నాంది కావాలి
- ఇంటర్ ఫలితాల విడుదలతో విద్యార్థులపై ఒత్తిడి
- మంచిర్యాల జిల్లాలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య
- తల్లిదండ్రుల భరోసా ఎంతో ముఖ్యమంటున్న నిపుణులు
- 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, సూచనలు



మానసిక, డిప్రెషన్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్



మంచిర్యాలటౌన్: పరీక్షలు బాగానే రాశామని అనుకుని తీరా ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువగా వచ్చాయనో, ఫెయిల్ అయ్యామనో.. జీవితం ఇక ఇంతే అనుకుని కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించాలే గాని చీకటికి భయపడితే రేపటి ఉదయాన్ని చూడలేమనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. జీవితానికి పునాది వేసే విద్యార్థి దశలో ఎన్నోరకాల ఆటుపోట్లు సహజంగా వస్తుంటాయి. వాటిని ఎదురీది నేడు ఉన్నతస్థానానికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలి. అంతేకానీ ఆత్మహత్యలకు పాల్పడి కన్నవారికి కడుపుకోతను మిగిల్చి నిండు జీవితాన్ని అర్ధంతరంగా చాలించవద్దని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

పరీక్షలకు ముందే భరోసా ఇస్తేనే..

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైంది. ఇందులో ఇద్దరు జిల్లా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. పరీక్షలో తప్పామని, మార్కులు తక్కువగా వచ్చాయనే కారణాలతో ఆత్మహత్యకు పాల్పడే ధైర్యం ఉన్న వారు ఆ ధైర్యాన్ని జీవితంలో ఎదిగేందుకు ఉపయోగిస్తే అనుకున్నది సాధించే అవకాశం ఉందని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు చదువులో ఒత్తిడిని లేకుండా ముందునుంచే చూడాలి. చదువు, ఆతర్వాత పరీక్షలు వంటి అంశాలపై విద్యార్థుల మానసిక ప్రభావం ఎంతగానో ఉంటుందని ముందుగానే గుర్తించి తల్లిదండ్రులు పిల్లల్లో భరోసా కల్పిస్తే ఫలితాలు వెలువడే నాటికి వారిలో ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతా భావం తొలగిపోయి సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతారు. పిల్లలకు చిన్ననాటి నుంచే చదువుతో పాటు వారి భవిష్యత్‌పై అవగాహన కల్పించాలి. తరచూ ఇరుగు పొరుగు పిల్లలతో పోల్చడం, ఇతరుల కంటే ఎందుకూ పనికి రారని పల్చన చేయడం వంటివి చేయవద్దు. వారితో సన్నిహితంగా ఉంటూ ప్రోత్సహించాలి. జీవితంలో చదువు ఒక్కటే కాదని ధైర్యంగా ఎలాంటి వాటినైనా ఎదుర్కొంటామనే భరోసా నింపాలి.

ఆత్మహత్యా భావన వస్తే కాల్ చేయండి

పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ క్లినిక్‌లో సైక్రియాట్రిస్టు ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి భరోసా కల్పిస్తున్నారు. సమస్యలతో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులు ఇస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు క్లీనిక్ తెరిచి ఉంచుతున్నారు. విద్యార్థులు చదువులో వెనుకబడటం, ఏకాగ్రత లోపించడం, అధిక చురుకుతనం, తరచూ కోపం తెచ్చుకోవడం, దూకుడుతనం, శారీరక, మానసిక అభివృద్ధి ఆలస్యం మొదలైన సమస్యలకు తగిన సలహాలు, సూచనలు, అవసరమైన చికిత్సను తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం టెలీమానస్ 14416 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులు, టీచర్ల సపోర్టు ఉండాలి



స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంను పిల్లలతో పాటు తల్లిదండ్రులు, లెక్చరర్లకు అవగాహన కల్పించాలి. ఒక పరీక్ష ఫెయిల్ అయితే జీవితం ఆగిపోతుందనే భావన తొలగిపోవాలి. తల్లిదండ్రులు, టీచర్ల నుంచి సపోర్టు వస్తే విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు ఫెయిల్ అయినా మా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారనే భరోసా కలిగి ఉంటారు. ఆత్మహత్య చేసుకునే వరకు వెళ్లే అవకాశం ఉండదు.

– డాక్టర్ సునీల్ కుమార్, సైకియాట్రిస్టు, జిల్లా మానసిక ఆరోగ్య క్లినిక్, జీజీహెచ్

ఓటమిని ఎదుర్కోవడం నేర్పించాలి



ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు గెలుపు ఎలా ఉండాలనే నేర్పిస్తారు. కానీ ఓటమిని ఎదుర్కోవడాన్ని నేర్పించరు. ఆత్మహత్య చేసుకునే వారిలో ఎక్కువగా సొసైటీకి భయపడి, ఎవరో ఏదో అనుకుంటారనే భయం వల్లనే. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠాలను చదవాలి. పరీక్షల నాటికే అన్నీ ఒక్కసారిగా చదువుతామంటే పరీక్షల్లో ఏంరాయలేని పరిస్థితి నెలకొని ఫలితాలపై ప్రభావం చూపుతుంది. పిల్లలపై ఎక్కువగా ఒత్తిడి చేయకుండా, స్వేచ్ఛగా చదువుకునేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు చూడాలి.

– డాక్టర్ కవిత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, ప్రముఖ సైకాలజిస్టు

పరీక్షల్లో ఫెయిల్.. ప్రాణం తీసుకున్నారు..

- వేర్వేరుగా ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య
- రెండు కుటుంబాల్లో విషాదం



సాత్విక్ (ఫైల్)

తాండూర్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మంచిర్యాల జిల్లాలో ఇద్దరువిద్యార్థులు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనలు ఆయా కుటుంబాల్లో విషాదం మిగిల్చాయి. వివరాలిలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన మైదం నారాయణ, విజయలక్ష్మి దంపతుల కుమారుల్లో చిన్నవాడైన మైదం సాత్విక్(18) బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో నాలుగు సబ్జెక్టులు తప్పాడు. బంధువుల ఇంట్లో పెళ్లి ఉండడంతో తల్లిదండ్రులు తాండూర్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాత్విక్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తాతకు పాసయ్యానని చెప్పి..

ఇంటర్ ఫలితాలు వెల్లడైన కొద్దిసేపటికి సాత్విక్ ఇంటికి వెళ్లాడు. ఇంటి సమీపంలోని బావి వద్ద తాత రాజయ్య పరీక్ష ఏమైంది బిడ్డా అని పలకరించడంతో పాసయ్యానని, 450 మార్కులు వచ్చాయని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు ఇంటికి చేరుకోగా తలుపు వేసి ఉండడంతో కంగారు పడ్డారు. కిటికీ లోంచి చూసే సరికి సాత్విక్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పాసయ్యా అని చెప్పితివి గదా బిడ్డా.. గంతట్లనే గిట్ల జేసుకుంటివేమని.. తాత మనవడి మృతదేహంపై పడి రోదించిన తీరు కంటతడి పెట్టించింది. పరీక్ష ఫలితాల వెల్లడికి ఒక రోజు ముందు సహచరులతో సాత్విక్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తాండూర్ ఎస్సై జగదీష్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నస్పూర్‌లో విద్యార్థిని..

నస్పూర్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిలయ్యాయని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దొరగారిపల్లెకు చెందిన గట్టిక తేజశ్విని(18) మంచిర్యాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో గణితం సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్రూంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



గట్టిక తేజశ్విని (ఫైల్)

కోచ్‌ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో నిర్వహించనున్న వేసవి శిబిరాల్లో శిక్షణ ఇవ్వడానికి అనుభవం ఉన్న కోచ్‌లు ఈనెల 29లోగా మందమర్రి ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్‌లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, ఎంపికైన వారికి గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవాలి

నస్పూర్: సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయి సీపీఆర్ఎంఎస్-ఎన్ఈ (నాన్ ఎగ్జిక్యూటివ్) కార్డు కలిగి ఉన్న మాజీ ఉద్యోగులు మెడికల్ కార్డులను రెన్యూవల్ చేసుకోవాలని సింగరేణి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకు ప్రతీ సంవత్సరం నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని దాదాపు 973 మంది మాజీ ఉద్యోగులు వారి భార్యల మెడికల్ కార్డులు రెన్యూవల్ కోసం లైఫ్ సర్టిఫికెట్ సమర్పించలేదన్నారు.

ఐకే1ఏ గనిలో ప్రమాదం!

జైపూర్: ఇందారం ఐకే1ఏ గనిలో బుధవారం మొదటి షిఫ్టులో జరిగిన ప్రమాదంలో బొద్దు తిరుపతి అనే ఎలక్ట్రీషియన్ కార్మికుడికి గాయాలయ్యాయి. విధుల్లో భాగంగా తిరుపతి గని లోపలి భాగంలో వెల్డింగ్ ప్లాంటుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో చేతికి విద్యుత్ షాక్ తగలడంతో చేయి, ముఖానికి గాయాలైనట్లు తెలిసింది. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినట్లు సమాచారం.

రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన సంయుక్త



గొల్లాల సంయుక్త

నస్పూర్: శ్రీరాంపూర్‌కు చెందిన గొల్లాల సంయుక్త ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంఈసీ విభాగంలో 1000 మార్కులకు గానూ 988 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. శ్రీరాంపూర్ ఏరియా ఐటీ విభాగం హెచ్ఓడీ సీనియర్ ప్రోగ్రామర్ జి.శ్రీనివాస్ కుమార్తె సంయుక్త హైదరాబాద్‌లోని లక్ష్య కామర్స్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏరియా జీఎం సంజీవరెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



అనిల్‌కుమార్ గౌడ్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన బొమ్మగొని తిరుపతి గౌడ్-తిరుపతమ్మ దంపతుల కుమారుడు అనిల్‌కుమార్ గౌడ్ (28) మంచిర్యాలలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఉక్కపోతగా ఉందని ఇంట్లోని కూలర్ ప్లగ్‌ను జంక్షన్ బాక్స్‌లో బిగించే క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనా?

కాలనీలో ఏర్పాటు చేసిన డీటీఆర్‌కు వారం రోజులుగా హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతోందని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే అనిల్ మృతిచెందినట్లు గ్రామస్తులు ఆరోపించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఈ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బెల్లంపల్లి: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బుధవారం బెల్లంపల్లిలోని డిస్కం ఏఈ కార్యాలయం ఎదుట తాళ్ల గురిజాల గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించుకు కూర్చున్నారు. డిస్కం అధికారులు రూ.2 లక్షలు నగదు ఇవ్వడానికి అంగీకరించి అందులో నుంచి కొంత మొత్తం అందజేశారు. విద్యుత్ శాఖ తరఫున ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బొగ్గు ఉత్పత్తి ద్వారా లాభాలు పెంచాలి

- సింగరేణి సీఎండీ ఎన్.బలరాం

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు ఉత్పత్తి ద్వారా సంస్థ లాభాలు పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం సూచించారు. సీఎండీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా బుధవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి పని ప్రదేశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆర్జిస్తున్న లాభాల్లో బొగ్గు ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉంటోందన్నారు. ఉత్పత్తి వ్యయం అధికంగా ఉండడంతో లాభాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గించి, బొగ్గు ఉత్పత్తి ద్వారా లాభాలు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. గడిచిన సంవత్సరం మాదిరిగానే ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాలు సాధించాలన్నారు. గతేడాది వార్షిక లక్ష్యాలు సాధించిన ఏరియా ఉద్యోగులు, అధికారులకు అభినందలు తెలిపారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతపై అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కైరిగూడ ఓసీపీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి లక్ష్యాలను జీఎం రవిప్రసాద్ వివరించారు. గోలేటి సీహెచ్‌పీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 39.5 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఏరియా చరిత్రలో ఇదే అత్యధికమని, 984 రేకుల బొగ్గును పోయిన ఏడాది ఏరియా నుంచి రవాణా చేయగలిగినట్లు సీఎండీకి వివరించారు. నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీ ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అటవీ భూముల సేకరణ ప్రక్రియపై మే తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందని సీఎండీ తెలిపారు. డిసెంబర్ చివరి నాటికి గోలేటి ఓసీపీ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యేలా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో పీవోలు సత్యనారాయణ, ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్ ఎస్ఈ బాషా, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యూపాయింట్ నుంచి కైరిగూడ ఓసీపీని పరిశీలిస్తున్న సీఎండీ ఎన్.బలరాం, అధికారులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రైతు అంకయ్య (ఫైల్)

వేమనపల్లి: మండలంలోని జాజులపేటకు చెందిన రైతు నానయ్య-గంగమ్మ దంపతుల కుమారుడు అంకయ్య సోమవారం తమ కుమార్తె కావ్యతో కలిసి చెన్నూర్‌కు వెళ్లి బైక్ మరమ్మతులు చేయించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో బతుకమ్మ వాగు వంతెనపైకి రాగానే వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న పిట్ట గోడలను ఢీకొట్టాడు. అంకయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశం, మాజీ సర్పంచ్‌లు కొండగొర్ల బాపు, కుబిడె మధుకర్ మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిలిచిన యువతి వివాహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లికి చెందిన సంపత్‌గౌడ్ మందమర్రికి చెందిన యువతి గతంలో పాఠశాలలో చదువుకున్నప్పుడు సాన్నిహిత్యంగా ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత ఆ యువతి పెళ్లిచేసుకోమని కోరడంతో నిరాకరించాడు. ఈ విషయమై ఏడాది క్రితం షీ టీంలో ఫిర్యాదు చేయగా కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ ఆమె జోలికి వెళ్లనని చెప్పడంతో వదిలేశారు. సదరు యువతికి బెల్లంపల్లికి చెందిన యువకునితో ఈ నెల 24న పెళ్లి నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న సంపత్‌గౌడ్ బెల్లంపల్లికి వెళ్లి ఆ యువకునితో గతంలో జరిగిన విషయాలు చెప్పడంతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బుధవారం జరగాల్సిన పెళ్లి నిలిచిపోయింది. యువతి ఫిర్యాదు మేరకు సంపత్ గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం



అప్పగిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మి (70) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు. మృతురాలి భర్త లక్ష్మయ్య, కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు రామాంజనేయులు ద్వారా మృతదేహాన్ని కళాశాలకు అప్పగించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రరెడ్డి, ప్రొఫెసర్ జితేంద్ర, వేంపల్లి ఎంపీటీసీ డేగ బాపు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'రాజారం'ను సందర్శించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామస్తులు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలేదని పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తీర్మానం చేశారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వాగుపై వంతెనలు లేక పిల్లలు చదువులకు దూరం అవుతున్నారని, వానాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తేనే ఓటు హక్కును వినియోగించుకుంటామని అధికారులతో తెగేసి చెప్పారు. దీంతో అధికారులు చేసేదేంలేక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పి వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాణి మండలం గోవెనకు చెందిన ఆత్రం చిన్ను, కొడప గంగారాం ఆసిఫాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో మోవాడ్ నుంచి చింతగూడకు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఆత్రం చిన్ను, కొడప గంగారాంకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట క్షతగాత్రులను 108లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

'బీజేపీని గెలిపించాలి'

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో బుధవారం బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బోయిని హరికృష్ణ, బొద్దున మల్లేశ్, జోగుల శ్రీదేవి, కిషోర్, రాజబాబు, బింగి సత్యనారాయణ, కంకణాల సతీశ్ పాల్గొన్నారు.

కెరీర్ సదస్సులో ప్రతిభ

మంచిర్యాలటౌన్: కల్పన, విజ్ఞానశాల టీం అనుసంధానంతో హైదరాబాద్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఫిబ్రవరి 9 నుంచి నిర్వహించిన రీ ఇమాజినింగ్ పాసిబులిటీస్ ఫర్ ఉమెన్ ఇన్‌స్టెమ్ కేరీర్స్‌పై ఆన్‌లైన్ తరగతుల్లో మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డి.సుమతి తెలిపారు. కేరీర్ వ్యాలిడిక్టరీ సమావేశాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో నిర్వహించగా 42 గురుకుల కళాశాలల నుంచి 800ల మంది విద్యార్థినులు పాల్గొన్నారు. మంచిర్యాల కళాశాలకు చెందిన 32 మందికి ప్రశంస పత్రాలు అందజేశారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పదోతరగతికి 671 మంది, ఇంటర్‌కు 1,330 మంది హాజరుకానున్నారు. బెల్లంపల్లిలో మూడు, మంచిర్యాలలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మైకల్ యార్క్ డాక్యుమెంటరీలపై సమావేశం

మంచిర్యాలఅర్బన్: బ్రిటిష్ మానవ శాస్త్రవేత్త, ప్రఖ్యాత డాక్యుమెంటరీ చిత్ర దర్శకులు డాక్టర్ మైకల్ యార్క్ రూపొందించిన ఛాయాచిత్రాలు, అనువాద పుస్తకం, రాజ్‌గోండుల దండారీ పండుగపై డాక్యుమెంటరీ చలనచిత్రాలపై ఈ నెల 25న జూమ్ వేదికగా 'చేరువై విలీనమవుతున్న క్షితిజాలు, దృశ్యమాన మానవ శాస్త్రం, మూలవాసీ సమాజాలు, ఆన్‌లైన్ మీడియా ఆర్కైవ్‌ల ప్రయోజనం'పై రౌండ్ టేబుల్ చర్చ ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అపర్ణ శర్మ(యూసీఎల్‌పీ) అధ్యక్షతన జరగనుండగా చర్చలో ప్రముఖ చిత్ర దర్శకులు, మానవ శాస్త్రవేత్త మైకల్ యార్క్, హెర్క్యులస్ సింగ్ ముండా (ఎడిన్‌బర్గ్), అర్పిత్ గైండ్ (యూసీఎల్‌ఏ) పాల్గొంటారని, జూమ్ మీటింగ్‌లో పాల్గొనేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9676180802 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



డాక్యుమెంటరీలోని చిత్రం (ఫైల్)